**ఆకాశంలో** విమానం హెూరు భోరున ఆగి చెవులను తాకింది. క్రింద గుడిసెలో నుంచి, రప్పున బయటికి పరువెత్తుకువచ్చి, మునగచెట్టువార నిలబడి— నీరెండ సూర్య కిరణాలను, అరచేత్తో వారిస్తూ గగన లోకాల లోకి తీవరించి చూసింది. అందని మబ్బుల లోంచి దూసుకుపోతున్న విమానం—

"అరేబియా సింధుశాఖ వించి, నేను రాసే ఉత్తరాలన్నీ యిమానంలోంచే వస్తయ్యే నాగీ" —అన్న, శాయన్నమావ మాటలు చెవులు గింగు ర్లెత్తించాయి. సంధ్యాదిక్కుల్లో దిక్కులేని మానవ రుధిరప్రవంతి అణ్వస్త్రం దూళితో కలిపి పొంగులు వారుతున్నది. గుడిసెల్లో తాటాకుపాకలమీద రేగుతున్న గాలిలో రహ స్యాలు చెవులను దూసుకుపోతున్నాయి. నాగి కనుచూపు అందినంతవరకూ హృదయ ఫలకంమీద, విమానం హెూరుని రంగరిస్తూనే ఉంది.

"ఏటికో నెల సెలవు దొరుకుతాది. దొర గ్గానే నీ దగ్గరకు వొచ్చి వాల్తానే" — అని ఎన్నో వాగ్దానాలు చేసి వెళ్లిపోయాడు శాయన్నమావ.

గుడిసెలను ఆనుకొని ఉన్న జామితోటలో నుంచి — చిలకలు వలపు పలుకులు చిలకరిస్తు న్నాయి. చిలకలమీద నీరెండ బంగారు కిర ణాలు పసుపుపచ్చని పూతపెడుతున్నట్టు మిల మిలలాడే నేత్రాలు ఆకర్షించుకొంటున్నాయి. హృదయసరస్సులో ఈదుతున్న మీననయనాల రెపరెపలకు, అదురుతున్న కాటుక కళ్లు, తల మీద పాపిటలా జామితోటలోంచి సాగిపోతున్న కాలిబాట వెంట చూపులు పరుగులుతీస్తూ ఆగిపోయాయి.


సైకిలు గంట గణగణ మ్రోగించు కొంటూ తపాలా బంట్రోతు, వచ్చి ఆగాడు.

"నాగమ్మ ఎవరమ్మాయి?" అని అడిగాడు.

"నేనే."

ఉత్తరం అందిపుచ్చుకొంది నాగి. రివ్వున చిలకలా రెక్కలు పుచ్చుకొని ఎగిరిపోవాలనిపిం చింది. శాయన్నమావ రాసిన కవరు గుర్తే! నీలంకవరు! చుట్టూ రంగు రంగుల గుర్తులు! ఎంత అందమైంది ఉత్తరం! ఉత్తరంమీది అక్షరాలు రంగు రంగుల భావాల రెక్కలు తొడుక్కొని ఎగురుతున్నట్టు... తపాలామనిషి బిత్తరపోయి చూస్తున్నాడు నాగి పరుగెడు తున్న దారి వెంట; ఎగిరెగిరి పోతున్నదా, పరు

# రాగబంధం



*తనకు అన్యాయం ఎలాగూ జరిగింది. మరొక కుటుంబాన్ని మట్టిపాలు చేయడం ఎందుకనే అన్న మానవత్వం ముప్పిరిగొన్న దేవత నాగి. కాయన్న కోసం చాతకి పక్షిలా కాచుకున్న నాగికి గుడిలో దైవం కళ్లముందే ఖామందు సూర్యం అన్యాయం చేశాడు. నెలలు నిండిన నాగి తండ్రి చిన్నయ్యకు అన్నం ఇచ్చి తిరిగివస్తూ ఆ గుడి ముంగిటే, వర్షంలో ప్రసవించింది. వెంటవస్తున్న ఖామందుకు "ఇదిగో మీ బిడ్డ! అమ్మగారికి బిడ్డలులేనిలోటు తీరతాది" అంటూ అప్పగించి కన్నుమూసింది. నాటి ఖామందు రాగబీజానికి నేటి నాగి రాగబీజం ఇది.*

# రాగబీజం

రమణశ్రీ

వెడుతున్నదా అర్థంకాక.

నాగి ఖామందు సూర్యంగారి ఇంటి ముంగిట వ్రాలింది.

"బాబుగారూ! ఈ ఉత్తరం కాసింత సదవండి! మావ రాసేడు అరేబియానించి."

సూర్యం నాగి ఆత్రానికి మెరుపు కొట్టినట్టయి, ఉత్తరం విప్పాడు. లేతాకుపచ్చ చిలకరంగు చీరగట్టి, సీతాకోకచిలక రంగుల రవిక తొడిగి, యౌవన ప్రాదుర్భావంతో చెక్కిళ్లమీద మెరుస్తున్న గులాబీరంగు తన గుండెచుట్టూ అద్దకం వేస్తున్నట్టుంది!

అక్షరాలు తొందరపడుతున్నయి చదవమని... "నా ప్రియమైన నాగీ! అక్కణ్ణుంచి, నిన్ను వదిలి వచ్చినప్పట్నుంచీ, నా మనసు..."

"ఆగండి బాబుగారూ! మీరు సదవొద్దు ఉత్తరం... అమ్మగారిసేత సదివించుకొంటా" అని సిగ్గుపడుతూ లాగేసుకొని— పెరట్లో సన్నజాజిమల్లె పందిరిదగ్గర పువ్వులు కోస్తున్న అమ్మగారిదగ్గరికి పరువెత్తింది!

"అమ్మగారూ! ఈ ఉత్తరం సదివెట్టండి! మావోడు రాసేడు" అని అందించింది.

సిగ్గుతో ముడుచుకొన్న కలువమొగ్గల్లాంటి నాగి కన్నులు వెన్నెలల్ని ప్రసరించాయి. ఎగా దిగా చూసి ఛాయమ్మ చేతికంది పుచ్చుకొంది ఉత్తరం. ఆకాశం, ప్రకృతీ— ఆ ఉత్తరంలోని అక్షరాల్లోకి తొంగిచూస్తున్నట్టున్నాయి. ఛాయమ్మ చిరునవ్వుతో ఉత్తరం ముగించింది. సన్నజాజి పందిరి విని హాయిగా వికసించింది. మలయమారుత సందేశం జగత్తంతా ప్రసారమైనట్టుంది.

"మళ్లీ నువ్వుత్తరం రాయవులే నాగీ!" అంది ఛాయమ్మ.

ఎంత అమాయికమైన ప్రేమలు వీళ్లవి! ఛాయమ్మ హృదయం అనురాగంతో ఆర్ద్రమైంది!

"నేను రాసేదేటుంట దండమ్మగారూ! మీ నీడకింద సల్లగా ఉన్నాం. అదే పది వేలు!... పాలల్లో ముంచినా, నీళల్లో ముంచినా మీరే గందా!... ఐనా రాసెడుదురుగాని... నాకేటి తెలుస్తది సెప్పండి? సదువా సంజా!" పక్కగదిలో సూర్యానికి అంతా వినబడుతున్నది.

ఎర్రని పెదవుల్లాంటి సంధ్య, కటిక చీకట్లోకి జారిపోతున్నది! నాగి నుదుటిమీద ముంగుర్లు తలలో గింగుర్లు తిరుగుతున్నాయి. పాలేరు చిన్నయ్య కూతురేమిటి? అది ఈనాడు యౌవన సామ్రాజ్యానికి రాణి! సెలయేరులా గలగల పారే దాని వయసు! తన హృదయ తటాలను తాకుతున్నట్టుంది! ఈ అసుర సంధ్యవేళ అంత అందంగా తనకళ్ల కెందుక్కనిపించుతున్నదో?

'ఎల్లొస్తానండమ్మగారు! కవరు తెప్పించెట్టండి! రేపో మాపో రాసెడుదురుగాని..." అని గుమ్మందాటి నడక సాగించింది నాగి.

"అదేమిటండీ! అలా గుడ్లప్పగించి చూస్తారూ? అది పోయిన దారికి! దాని మొగుడుత్తరం రాశాడని దానికెంత విరగబాటో చూశారా? ఎక్కడి అరేబియా సింధుశాఖ? ఎక్కడ నాగి?... వాళ్ల కంపెనీ మద్రాసులో ఉన్నప్పుడు అక్కడ పని చేసేవాడట! కంపెనీ తీసేస్తూ, కూడా తీసుకుపోయాట్ట ఇంగ్లీషు దొర. చిన్నపుడెపుడో దీని పెళ్లిచేసి పారేశాడు చిన్నయ్య. ఎలాగేనా, పిల్లది చేసుకొన్న అదృష్టం!"

సూర్యం, ఛాయమ్మ కళ్లలోకి సూటిగా చూశాడు.

* * * *

"ఏరా చిన్నయ్యా! మళ్లనిండా నీళ్లు నిలద్రొక్కకండా వదిలేశావేం? నీకూ ఈమధ్య పని బద్ధకం ఎక్కువైందిరా!" అని సూర్యం చిన్నయ్యని కేకలేస్తున్నాడు.

ఆకుమళ్లు వయ్యారంగా పచ్చపచ్చని తరంగాలుగా వంగి వంగి ఊగుతున్నాయి! మడిలో పచ్చని ప్రవాహం పొంగులు వారుతూన్నట్టుంది.

"బాబూగోరూ! పిల్ల కూడుదెచ్చాక మళ్లన్నీ సక్కబెడదామనుకొంటున్నానండి!" అని చిన్నయ్య పొలం గట్టుమీదనించి పైకి లేచాడు.

ప్రక్కనున్న తాటిచెట్టు హోరున అవలించింది. రెండుగా చీలిపోయి, ఒంటిమొదట్లో గుబురుగా ఎదుగుతున్న చెట్లజంట. తలలెత్తి గుసగుస లాడుకుంటున్నట్టున్నాయి. తుమ్మచెట్ల తలల్లో పెనవేసుకొని చిక్కులుపడ్డ కొమ్మలు విదళించుకొంటున్నాయి. పశువుల పాకలో ఆవుదూడ 'అంబా' అని అరచింది. బీట్లో చుట్టూ వేసిన మామిడిమొక్కలు వెదురుపేళ్ల తడకల్లోంచి తొంగి చూస్తున్నాయి పచ్చ పచ్చగా. కనుచూపు మేరవరకూ ప్రకృతి ఆవులిస్తున్న సౌందర్యం మానవతలో జడత్వాన్ని మేలుకొలుపుతున్నట్టుంది.

"మీ అల్లుడు దేశంగాని దేశం, అంత దూరం ఎందుకుపోయినట్టు చిన్నయ్యా?"

"ఏవోఁబాబు! ఏ యేషాలేసినా పొట్టకూటికే గందా!... ఆ డిట్టమొచ్చినట్టు పోయాడు. ఆళ్ల ఆయిలు కంపిణీ సెన్నాపట్నంలో ఉండేదంట! అక్కణ్ణుంచి కంపిణీ నెగిసిపోతా, ఈణ్ణిగూడా లాక్కుపోయారు ఏటో సిత్తరం" అని ఆశ్చర్యపోయాడు చిన్నయ్య.

మధ్యాహ్నం అన్నంగంప నెత్తిమీద వయ్యారంగా చుట్టకుదుర్లో గరిమ నాభిస్థానం తప్పకుండా జారుడుగట్లమీద నడుస్తూ తెచ్చి పెట్టింది నాగి. సూర్యానికి అడివిపూల వాసన సహజంగా గుబాళించినట్టయింది. గంప మకాంలో పెట్టి బయటికి వచ్చింది. మనసు పరాధీనమై ఉన్నదేమో, సూర్యం తన వెంపే దృష్టి లగించినట్టనిపించి, సిగ్గు దొంతరలు శరీరంమీద తరగలెత్తాయి.

"ఏవేఁ అమ్మగారిచేత ఉత్తరం రాయించకొన్నావూ?" అడిగాడు తమాషాగా.

సిగ్గుముసుగులో మునుగుతూ, "లేదు బాబుగారూ!" అంది. అధరాలు ప్రణయ భావంతో అదురుతున్నట్టున్నాయి. మధ్యాహ్నం ముదురుటెండలో సిగపూవయినా వాడకండా తుమ్మచెట్టు నీడలో నిలబడి ఉంది.

"ఎప్పుడొస్తాడో మావఁ? రోజూ ఓ విమానం ఆకాశంలో ఎగురుతూ పోతూంటే— ఆ విమానంతో మావకి సందేశ మంపిస్తుంది హృదయం!

"ఓరి చిన్నయ్యా! నేను పోతున్నా. రేపట్నుంచి దమ్ము మొదలుపెట్టాలి!"— అని హెచ్చరించి, ఇంటివైపు బయల్దేరాడు సూర్యం.

"నేను యెళ్లొస్తానయ్యా! కూడుదిను" అని నాగి నడక సాగించింది.

మళ్ల వర్షాలు కురిసీ, నిండీ నిండకండా చెమరుస్తున్నాయి. పాదాల క్రింద మెత్తని మట్టి నలిగిపోతున్నది. ఉండుండి ప్రకృతి ఒక్కసారి, హాలాహలం త్రాగినట్టు నల్లబడిపోయి, ఆకసంనిండా మేఘాలు క్రమ్ముకొస్తున్నాయి. గాలి మానవ శరీరాల్ని బలంగా తాకుతున్నది. ఉరుములు ఫెళఫెళలాడాయి. విసురుగా పారుతోన్న కాలవ తాటివంతెనమీదనించి దాటుతోన్న వ్యక్తుల్ని చూసి ఆగినట్టయింది. తాటి

వంతెన గజగజ వణికింది.

బీటుమీద మేస్తున్న గొర్రెలూ, మేకలూ, పశువులూ ఉధృతమైన వానజల్లులకు చెల్లా చెదురవుతున్నాయి. అల్లంత దూరంనుంచి, గొల్లపిల్లవాడి పెదవుల మధ్య నలుగుతున్న వెదురు బొంగులోంచి సన్నని నాదం ధారగా సాగుతున్నది. వర్షానికి తడిసిన చల్లని నాదం. చెట్లమీద పక్షులు వానజల్లులకు పిలపిల లాడుతూ రెక్కలు ముడుచుకొన్నాయి.

ప్రక్కనే ఉన్న పాడుపడిన గుడిలో ఏ క్షుద్రదేవతో తల దాచుకొని ఉన్న పాడుపడిన మంటపం. సూర్యం గాలివానకి, దేహంలో రక్తం వేడెక్క, నరాల్లో పారుతున్న జీవన సంగీతం! పాడుపడిన గుడిలోకి అడుగు పెట్టాడు. వెనకతట్టునే వస్తున్న నాగి కూడా "బాబుగారూ!" అంటూ పాడుపడిన గుడి మండపంప్రక్క నిలబడింది. నీళ్లలో మునిగిన కోడిపెట్టలా గుండె రెక్కలు తపతప కొట్టు కొంటున్నాయి. తల విరబోసుకొన్న ప్రకృతి వర్షా స్నానంలో అర్ధనగ్నంగా భ్రమింపిస్తున్నది.

నాగికి తీవ్రమైన వానజల్లు మోహాన్ని కొట్టింది. భయపడి వెనక్క జరిగింది. రుద్ర వీణా సంగీతంలాంటి ప్రళయగీతం ప్రకృతి రేకురేకునా విరిసింది.

"రా నాగీ రా! జల్లులో ఏంతడుస్తావు!"— అని సూర్యం ఆహ్వానించాడు.

ప్రకృతి ఉద్వేగంతో నిట్టూర్చింది! "రా! నాగి! రా!" గుండె గుహలో ప్రతిధ్వనిస్తున్న శబ్దం! కామప్లావితమైన రక్తం కన్నుల్లోంచి, రక్త రక్తబిందువుకు ప్రవహిస్తున్నది.

తనూ, నాగీ...

స్త్రీ... పురుషుడూ...

స్నిగ్ధమైన తనూలతకి దోహదం కలిగినప్పుడు పుష్పించడ మెంతసేపు?

ఆకాశం దూరంగా మిలమిల మెరిసింది. ఫెళఫెళార్భటులతో ఉరుములురిమాయి. గుండెలు ఝల్లురనే పెనుజల్లులు వర్షించాయి. ప్రకృతి ఒంటరితనం!

• • •

"బాబుగారూ!" అని నిస్సహాయ నిర్వికార స్థితిలో ప్రకృతిని దేవురించింది నాగి. ముఖ మండలంపీది వర్షబిందువులు స్వేదబిందువులతో కరిగి ప్రవహించాయి. ప్రకృతిమీద ఘనవిజయం సాగించిన పౌరుషత్వపు కౌగిలిలో కరిగిపోతున్నది తదీయ ప్రకృతి!

• • •

గూడులో కడుపు నిండీ నిండని కూడు పొయ్యిమీద కుండలో కుతకుత ఉడుకుతున్నది! కణకణ మండుతున్న కొరకంచుల వెల్తురు అంచుల్లో నాగి ముఖం దెబ్బతిన్న కోడె త్రాచులా రోజుతూ ఉంది!

మలకమంచంమీద కూచున్న చిన్నయ్య



వెలుగుబాట

ఫోటో — మోహన్ రాజ్ (వెల్లూరు)

"ఇగ ఆ కమతం సెయ్యడం కట్టవే నాగీ! సాలీ సాలనీ పాత జీతాలకి ఈ బతుగ్గడవదు. ఐసాపైసా రేపు తేల్చిపారేస్తాను! కమతం మానుకొండి ఏ కూలిపనికి పోయినా, ఇన్ని డబ్బులు కిట్టకపోవు" — అని ఊరుకొన్నాడు. నాగి తలలో చీకటి తీగల్లాంటి వెంట్రుకలు పొయ్యిమంట వెల్తురులో బంగారు ఊత పెట్టినట్టు నిగనిగ లాడాయి.

పొయ్యి వేడికి కళ్లలో గూడుకట్టుకొన్న మంచు కన్నీరుగా కరుగుతున్నది. వాళ్ల పాదాల ముందు బానిసలుగా బతికే తమలాంటివాళ్లకి స్వాతంత్ర్య మెక్కడిది? కడుపు చించుకొంటే కాళ్లమీద పడియేడుస్తుంది.

ఛీ! అంత మోతుబరికి, అగ్రజాతివాళ్లకి అదేం బుద్ధి?... భార్య కటిక గొడ్రాలు. పిల్లలు పుట్టే యోగ్యత లేదని, ఊళ్లో అనుకొంటూ ఉంటే తను వింది. తన కళ్లముందు మావ, ఆకలిగొన్న సింహంలా గర్జిస్తున్నాడు. తన మావకి తనమూలంగా అన్యాయం జరిగితే ఎవరు సహించాలి? తనూ, తన తత్వం. ఒట్టి పిరికిది! హృదయం మెత్తనిది. మావని తలుచుకొని, గుండె గొంతుకలో కుమిలి కుమిలి దుఃఖించింది.

గూడు బయటికి వచ్చి తొంగి చూసింది. సృష్టి, స్నానమాడిన అర్ధనగ్న స్వరూపిలవలె చెట్లు విరబోసుకుని — దుఃఖాశ్రువులను బొట్లు బొట్లుగా రాలుస్తున్నాయి.

"వారేం సేసినా సెల్లుద్ది" అంటున్నాడు చిన్నయ్య.

• • •

"చిన్నయ్యా! నీకు జీతం చాలదని గోల బెడుతున్నావుగా! నెలకో రెండు కుంచాలు పెంచితే చాలా? వచ్చేది చలికాలం...ఓ దుప్పటీ కూడా ఇస్తున్నా" — అని అందించాడు సూర్యం.

ముసలితను అడక్కుండానే జీతం పెరిగినందుకు శరీరంమీద ముడతలు, ఆనందంగా సాపుతేరాయి.

నాగి తల వంచుకొని, గింజలు కొలిపించుకొంటున్నది. సూర్యం నాగి ముఖ కవళికల్లో ఆంతర్యాలను కొలిచే హృదయ ప్రమాణాల కోసం తడుముకొంటున్నాడు.

నాగి ఛాయమ్మగారి దగ్గరికెళ్లి, "అమ్మగారూ! మా శాయన్నమావని రమ్మనమని ఉత్తరముక్క రాసిపెట్టరూ?" అంది.

"ఇన్నాళ్లకు తీరికయిందటే పిచ్చిమాలోకం! వాడుత్తరం రాసి పదిహేను రోజులైతే... కవరు తెప్పించే ఉంచా... రాస్తా మండు" — అంది ఛాయమ్మ.

సూర్యం ఆ సంభాషణలో ఆంతర్యాన్ని సంగ్రహించడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు; గుండెల్లో ఆవేగాన్ని అణచుకొంటూ.

ఏవేమి రాయిస్తుందో? వాడసలే కొమ్ములు తిరిగిన రౌడీ! కత్తులూ కటార్లు గుండెల మీద నూరడానికైనా జంకడు.

"ఉత్తరం వ్రాయించుకొనే ముందలా కన్నీళ్లు పెట్టుకుంటావుటే పిచ్చి పిల్లా! వాణ్ణి చూడాలనుంటే తప్పకండా వస్తాడు. నీవు కోరినవన్నీ తెస్తాడు. నివ్వేం దిగులు పెట్టుకోకు."

"దిగులెందుకండమ్మగారూ! రేబగళ్లూ ఆడి రూపే నా కళ్లనిగట్టి దోబూచులాడతన్నాది. కలలో గనిపించినా, కళ్లలో కనిపించినా, నా రగతంలో ఆడి రూపే! ఆడి ఒడిలో తల దూర్చి భోరున యేడవ్వాలనుందండమ్మగోరూ!" — అని వలవల ఏడుస్తూ కళ్లని పైటచెంగుతో అద్దుకొంది.

అమాయికమైన ఆ ప్రేమకి ఛాయమ్మ ఆశ్చర్యపడుతూ ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టింది. సూర్యానికప్పటికి గుండె తేరుకొంది. ఛాయమ్మ నాగి గోడు ఉత్తరంలో వినిపించేలా, వ్రాసి చదివి వినిపించింది.

"అమ్మగారూ! మీ కడుపునో కాయగాస్తే మీకే దిగులూ లేకపోను. దేవుడు మీకా బాగ్గెం కలిగించనేదు" — అని గంప నెత్తికెత్తుకుంది నాగి.

ఛాయమ్మ కామాటలు అర్థమయ్యీ కానట్టయి, గుమ్మంవరకూ వచ్చి వెనక్కు తిరిగింది! తన కళ్లు అప్రయత్నం కన్నీరుతో నిండి, తడిసిన చూపులతో సూర్యం వైపు తిరిగింది. ఆయన ఏదో, అవ్యక్తమైన అపరాధం చేసిన వ్యక్తిత్వరోగంతో బాధపడుతున్న

ట్నున్నాడు.

• • •

దుమ్ములూ, ఊడుపులూ ఐనన్నాళ్లూ చిన్నయ్యకి భోజనం తెస్తూనే ఉంది నాగి. నేలతల్లి శిరసుమీద జరజర పాము మెలికలా సాగిపోయే పాపిట కాలిబాటమీద నాగి, హొయలు వయ్యారాలు ఒలకబోసుకుంటూ సాగిపోతూంటే సూర్యం సైకిలుమీదనో, కాలినడకనో, ఎదురుకెదురౌతూండేవాడు; పెదవులమీద విషాదాంతమైన చిరునవ్వు వెలిగిస్తూ.

రెండు ప్రశ్నల్లాంటి నాగి కనులు తన్ని ఎదుర్కొనేవి??

ఒక రోజు గుడి దగ్గర నాగిని పలకరించాడు.

"బాబూ! మీరు ధీమంతులు! మీరేటి సేసినా సెల్లుద్ది. ఎటొచ్చీ, మీ బానిసల్లాంటి మాలాటోళ్ల బతుకులికి విలువలేదు. మేం మడుసులం గాదా? మాకు మనుసులూ, మనువులూ లేవా?" అని ఎదిరించింది. నాగి పాములా బుసగొట్టింది.

సూర్యం కుబుసం విడిచిన పాముని చూచినట్టు చూసి, తల వంచుకొని వెళ్లిపోయాడు.

"తల్లీ! నీ కళ్ల కెదురుగ్గా జరిగిన ద్రోహం!" అని, పాడుపడిన గుడిలో బంగారు తల్లి విగ్రహంముందు మోకరిల్లింది.

• • •

"మావా! నన్నొదిలెల్లిపోనావా? మళ్లీ ఇన్నాళ్లకి దొరికిందా సెలవు? నా గుండెల్లో ఆరని నిప్పు రగిల్చి ఎల్లిపోనావు. ఆదారిపోతే, నా కళ్లకంతా సిమ్మసీకటైపోదా?" — కన్నె లేమనసువంటి వెన్నెల్లో కాలవ తీరాన కూర్చుని మావతో పలికింది చిలకలా.

దూరాన తార చీర ముసుగులో కిలకిలా నవ్వినట్టయింది మావకి. ఎక్కడి అరేబియా సింధుశాఖ? ఎక్కడి నాగి?

"మావా! నా బతుకుమీన నాకే నమ్మకం నేదు. నువ్వు నమ్ముతావా? నువ్వు"— కనుగుడ్డులో కన్నీటి సుడి గిరగిర తిరిగింది.

శాయన్న కళ్లలోకి సూటిగా ప్రశ్నవేసి అడిగింది. అతను చలికి వేసుకొన్న 'ఓవరు కోటు' లో చలి చల్లచల్లగా నలిగిపోతున్నది.

"నిన్ను నమ్మకేం సేస్తానే నాగీ! నువ్వు నా దేవతవి! అంతలా గుత్తరం రాస్తే రెక్కలు గట్టుకొని, ఎగిరొచ్చేశాను"— అన్నాడు శాయన్న పిచ్చిమావ!

నాగి మనసులో చేతులుపెట్టి కెలికినట్టయింది. కన్నుల వలవల కన్నీరు పూరిస్తూ ఆ వెన్నెల రేయిలో మావ కందీ అందకుండా పరుగులు తీసింది.

"అప్పుడే యెల్లిపోతావా? నన్నూ నీ యెంట తీసుకపో."

ఒడ్డు వెంట ఇసుకలో జారిన వెన్నెల కిరణాలు గుచ్చుకొంటున్నాయి నాగికి. కాలువలో తరగలెత్తి పారుతున్న నన్నని ధ్వనిలో నీరు

# రాగబీజం

గలగల నర్తిస్తూన్నట్టుంది. వెన్నెల్లో అమృతాన్ని త్రాగుతున్న మావిడి, జామితోపులోని చెట్లు తల విరబోసుకొని చిక్కులు దీసుకొంటున్నట్టున్నాయి. ప్రక్క మొగలి పొదల్లోంచి, మిర్రి మిర్రి చూస్తూన్న పడగెత్తిన ఫణిరాజు, శరన్మాసంలో వెన్నెల శృంగారాన్ని చూసి చప్పున కనులు మూసుకొన్నాడు.

• • •

"బాబూ! పిల్ల నీళ్లోసుకుంది. కాత్త అల్లుడి కుత్తరంముక్క రాసిపెడుదురూ!" అనడిగాడు చిన్నయ్య.

ఛాయమ్మకి మాటలు ప్రక్క గదిలో ఉంటే వినబడ్డాయి. సూర్యం చేతుల్లో అక్షరాలు వణికాయి.

"ఎన్నోనెలో, ఏవిటో ఏదేనా రాయాలా. చిన్నయ్యా" — అని బొంగురుపోయిన గొంతులో అడిగాడు.

"అయ్యన్నీ ఆడోళ్లకేగాని మొగోణ్ణి నాకేటి తెలుస్తుంది బాబూ! పాకల్లో వోళ్లంతా అనుకుంటా ఉంటే నేనూ యినుకున్నా" — అని చిన్నగా నవ్వాడు.

సూర్యం కాగితంమీద సృష్టిస్తోన్న చప్పుడు చిన్నయ్య హృదయంలో పొరలపై ప్రతిధ్వనిస్తున్నాయి.

"దాని కడుపునో మనవడు పుడుతాడని, ఎన్నో ఆసలు పెట్టుక్కొచున్నా. ఎక్కడో అడు ఉద్యోగం మానుకురమ్మంటే ఆడు రాడు. దీన్నక్కడికి తీసుకుపోడు. ఒంటరి పక్షిలా బతుకుతున్నాది పిచ్చిమాలోకం! రక్షించినా బక్షించినా మిమ్మల్నే మీ కవంతాన్నే నమ్ముకునున్నాం. నాకోసం, నేనంటే నా పిచ్చితల్లికి ఎంతో గురి. వొళ్లమాలిన అభిమానం. నా



గానలోలుడు

చిత్రం-ఎ. వి. దక్షిణామూర్తి (కర్నూలు)

కోసరం ఎంతో తాపత్తరం దానికి. అది నేకండాపోతే ఏనాడో నా గొంతులో ఇన్ని తులిసినీళ్లు దిగిపోను."

సూర్యానికి భాష అర్థంకాక, 'అలాగా' అన్నట్టు చూశాడు.

"అయ్యా! నీ వీడున్నావా? నీకోసం యెతుక్కుంటా వస్తన్నా" అని నాగి వచ్చింది.

ఉత్తరం చదివి వినిపిస్తున్నాడు సూర్యం. నాగి ఛాయమ్మగారి వైపు దృష్టి నిగిడించి చూస్తున్నది. "మీ కడుపునో కాయగాస్తే మీకే దిగులూ ఉండకపోను." ఛాయమ్మ చెవుల్లో నాగి అన్నమాటలు గింగుర్లెత్తిపోతున్నాయి.

"రా! నాగీ! రా! మీ ఆయన కేవన్నిరాయమంటావో? అడుగుతున్నారు బాబుగారు!" అంది ఛాయమ్మ.

నాగి నవ్వింది. ఆ నవ్వులో చమత్కారం లేదు. నత్కారం లేదు. వా సన లేదు. భావన లేదు. సూర్యానికా నవ్వు భయం వేసింది. ఛాయమ్మకి వికటంగా అనిపించి, వెగటు వేసింది.

ఒక రోజు — ప్రొద్దు వాటారుతోన్న కొండమీద — గొర్రెల్ని మేపుతున్న గొల్లపిల్లవాడు వెదురుబొంగు మూగవోయిందని, విసిరికొట్టాడు క్రిందకి. అది నాగి పాదాల కింద నలిగిపోయి విరిగిపోయింది. సూర్యుడు అస్తమిస్తున్న బింబకాంతి ఎర్ర తామరలో రేకులై విరిసింది. కొలనులో — తామరపాకు మీద చిలికిన నీటిబిందువులు — ముత్యాల సరాలుగా గుచ్ఛాలనిపించుతున్నది నాగికి. ఎదురుగా వస్తున్న సూర్యం — మకాంలో ఆ రాత్రి పడుకోడానికి — నాగిని చూసి ఆగాడు. వెలగచెట్టునించి వెలగపండు రాలిన చప్పుడు. అల్లంతదూరాన అమ్మవారికి బలిగా వేప చెట్టున వ్రేలాడుతూన్న కోడిబుర్రలు మిర్రి మిర్రి చూశాయి.

"నాగీ! ఆగు."—

"నా మానాన్న నన్ను బతకనివ్వండి బాబుగారు! ఈ శరీరం ఏనాడో, ఎంగిలైపోయింది. ఈ వంటిమీద నాకు గురినేదు. ఎంత త్వరగా ఈ లోకాన్నిడిచి వెళ్లిపోతే, అంతే సాలు!" అని గుడ్లనీరు గ్రుక్కుకొంది.

సూర్యం మరి నిరుత్తరుడయ్యాడు. "నేనేదో అపరాధం చేసినట్టు నా మనసు పెనగులాడుతోంది నాగీ! దీనికి ప్రాయశ్చిత్తమేమిటో అర్థంగాక బాధపడుతున్నా."

"మీ పాదాలముందు బతికేవోళ్లం! నేనేమాత్రం కాసింత సెప్పినా గూడెం గూడెమంతా మీమీద కత్తిగడతది. ఎన్ని పేణాలు బలైపోతయ్యో మీ రెరగనిదేవుంది బాబూ! గూడానికి మా మావంటే ఎంత గురో? ఎరుగుదురుగా! నా ఒక్క పేణం ఎలా పోయినా,

(తరువాయి 56 వ పేజీలో)

# రాగబీజం

( 44 వ పేజీ తరువాయి)

నాకు విచారం లేదు. అన్నాళ్లదాకా ఈ బొందిలో ఊపిర్లు నిలబడుంటాయి" అని, నాగి, తల వంచుకుని, కాలప్రవాహానికి క్రుంగిపోతూ వెళ్లిపోయింది.

సూర్యం హృదయం ద్రవించిపోయి, నాగి దేవత... అన్న శబ్దతరంగాలతో శరీరమంతా ప్రసరించింది.

• • •

కాలం తలవంచుక వెళ్లిపోతున్నది; నాగి చరణాలముందు నించి బరువైన సృష్టిభారాన్ని అడుగుల్లో అడుగులు వేసుకొంటూ. చిన్నయ్య చిన్నబుచ్చుకొన్నాడు అల్లుడు దగ్గరినుంచి వ్రాయించిన ఉత్తరానికి జవాబు రాలేదని. నాగి మరింత మూగదై పోయింది. తనెందుకు జీవిస్తున్నదీ తనకే అర్థంకాని దుస్సహ పరిస్థితిలో. విరగబడిన చేలు వంగి వాలినట్లు, విరగగాసిన మామిడిగున్నలాగ తనలో సృష్టి మరింత భారావహమైంది. అలాగే మోసుకు వెళుతున్నది తండ్రికి అన్నం. పొలంమీద కోసిన పంట పనలమీద పకపక లాడుతున్నది.

"సూడు నాగమ్మా! ఇంక నాకోసం రాబోక. ఎవరిసేతికన్నా ఇచ్చి పంపు. నీకు నెలలు నిండినాయి. ఏ యేలకేయేలో!"

ఉన్నట్టుండి గాలి రివ్వురివ్వున వీచింది. నాగి తిరిగి గంప నెత్తికెత్తుకొని బయలుదేరింది. తుమ్మతోపులో పిచ్చిగా పెరిగిన మొక్కలు, తలలూగిస్తున్నాయి. ఆకాశంలో పల్లటీలు కొడుతూ, తెల్లని నల్లని పక్షులు కిలకిలారింపులతో క్రిందికి దిగిపోతున్నాయి — గగనకాంత కంఠసీమలో ముత్యాలహారాలు తెగినట్టు.

పడక మందగించి, వాయుతరంగాల, వడిలో అట్టిట్టూగుతూ నాగి జీవననౌక, గుడి చేరువ కొచ్చేసరికి సొమ్మసిల్లి ఒడ్డునకొరిగి విరిగిన కెరటంలా ఒరిగిపోయింది. ఝల్లు ఝల్లుమనే వానజల్లులు పర్జన్య గర్జాహతి ననుకరించి, భీతావహంగా నిట్టూరుస్తూ నాగిని చుట్టబెడుతున్నాయి. తూగుతూ ప్రాకుతూ మెట్ల మీదికి వచ్చి పడింది. దూరాన తాటిచెట్ల తోపులో పరాభూతంగా మహోఖడ్గధారాహతితో త్రెళ్లించడానికి పూనుకొన్న వజ్రం వలె మెరిసింది మెరుపు. ప్రచండంగా ఉరిమింది మేఘరేఖ. నేల తల్లి ప్రసవవేదనాభరమైన జీవన ప్రకృతిని విడంబిస్తూ పెనుగాలిగా మూలిగింది.

నాగికి నొప్పులు విపరీతమైనాయి. అల్లంత దూరంలో వర్షావిజృంభణను పడగెత్తి పరికించాలనుకొన్న ఫణిరాజు నాగి మూల్గులు విని తల లోపలికి లాక్కున్నాడు. వెంగచెట్టు, మామిడిచెట్టు నీడల్లో గొర్రెలు, మేకలూ చెవులు రిక్కించి, వినలేక మూగవన్నుగా చూస్తున్నాయి. అవతలి మకాంలో గొల్లపిల్లవాడి చేతిలో మురళీనాదాన్ని ధారపోస్తున్నది.

భోరున హోరున వర్షం! నేల బుర బుర బురదెత్తి బుగులుపోయింది. నాగి 'అమ్మా' అని బాధతో ప్రాణాలు బిగబట్టి మూలిగింది. అవతలి మకాంలో గొల్లపిల్లవాడు తొంగి చూశాడు. దృశ్యాన్ని చూసి, వానలో తడుస్తూ గూడెంలోకి పరుగుతీశాడు. విలవిలలాడిపోయిన నాగి శరీరం పాముల్లే వ్యథాహతంగా మెలికలు తిరిగిపోయింది మాతన సృష్టికి! దిక్చక్ర రేఖలను మెరిపిస్తూ వెలిగిన ప్రచండ కరవాలం లాంటి సౌదామినీ కాంతిలో — నాగి గర్భం ఛేదించుకొని బయటబడ్డ బిడ్డ లోకాన్ని కేలెత్తి కేకేశాడు.

వర్షంలో తడిసిపోతున్న వరి వెన్నులవలె వెన్నుల్లో. పొడుస్తుంటే దిక్కుతోచని సూర్యం వెనుదిరిగి వచ్చేస్తున్నాడు. "బాబూ" అని పిలిచింది వేదనలు నిండిన మూగ గొంతు లోంచి....

"నాగీ!" అని బిత్తరపోయి సమీపించాడు సూర్యం.

"ఇదిగో! మీ బిడ్డ!... నేను మా నాయనకి, అందరికీ దూరంగానే ఉన్నా. ఈ దీపంలా వెలిగించిన బిడ్డ నిన్నాళ్లూ కడుపులో, గుండెలో చిచ్చుల్లే దాచుకొని ఈనాడు మీకప్పగింతన్నాను. అచ్చం మీ బిడ్డ. అమ్మగారికి బిడ్డల్లేని లోటు తీరతాది. ఈ బిడ్డని పువ్వుల్లో యెట్టి పెంచుకోండి!" నాగి కన్నుల్లో కన్నీటిని వర్షపుజల్లు తుడిచివేసింది.

"నాగీ, నువ్వు దేవతవి. మాకోసం, నేను చేసిన తప్పుకోసం, నీ జీవితాన్నే బలి చేసుకొన్నావు"— అని సూర్యం పొత్తిళ్లలో బిడ్డని తీసుకొని, గొడుగుపట్టి హోరుమని కురుస్తున్న వర్షంలో వెళ్లిపోయాడు.

• • •

గూడెంనించి పరుగు పరుగున వచ్చిన జనానికీ, గొల్లపిల్లవాడికీ, చిన్నయ్యకీ వచ్చి చూసేసరికి నాగి శవం గుడి మెట్లమీద చిందర వందరగా పడి ఉంది! ★

# మూసిన తలుపులు

( 40 వ పేజీ తరువాయి)

బ్రతిమాలుకున్నా [illegible]కుండా ఆనాడే వచ్చేశాను. ఇందులో నా తప్పుందో వారి తప్పుందో తెలియదు కానీ అదృష్టహీనులు జీవితంలో పరిస్థితులకు ఎదురుతిరిగితే చాలా బాధలు పడవలసి వస్తుందనే అనుభవాన్ని గడించాను. నేనలా వచ్చెయ్యడం తప్పంటావా, రాజా?"

"లేదు, వదినా! పరిస్థితులు మానవుడిని రాక్షసుడుగా మారుస్తుంటాయి. ఆవేశం యుక్తాయుక్త విచక్షణలను నశింపజేస్తుంది."

"నా బ్రతుకును చూసి అమ్మ అప్పుడప్పుడు తన పాపాలకు ఫలితం తన బిడ్డలను అనుభవించమంటున్నావా దేవుడా అని దుఃఖిస్తుంటుంది. ఎన్నోమార్లు తిరిగి వెళ్లాలని ప్రయత్నించాను. కానీ తిరిగి ఆ జీవితం తలుచుకొంటే ఒళ్ళు జలదరిస్తుంది. మనశ్శాంతి, సుఖం, ఆనందం, భర్త ప్రేమ, ఆదరణ, ఆప్యాయత, సానుభూతి— వీటిలో ఏ ఒక్కటీ లేని ఆ జీవితంలోకి ప్రవేశించాలంటే భయపడి ఇక్కడే ఉండి ఈ జీవితాన్ని గడపడం మేలనుకొన్నాను."

"చీకటిలో ఉంటూ అదే ఆనందమనుకొంటే ఎలా, వదినా? కష్టాలను ఎదురుకొన్నప్పుడే నిజమైన ఆనందం లభిస్తుంది."

"అంత ధైర్యం అబలనైన నాకు లేదు, రాజా!"

"అలాగని వాటికి భయపడి పారిపోతే సుఖంగా ఉండలేం, వదినా!"

"ఏమో! ఇక వారితో సంసారం చేస్తానన్న నమ్మకం నాకు లేదు. అది నాకంతగా ఇష్టం లేదు కూడా."

"ఈ మోడు బారిన జీవితంపై ఇష్టమా?"

"ఇక్కడేం లోకువ? అమ్మ ఉంది. లత ఉంది. అన్నిటికీ మించి నువ్వు ఉన్నావు. కావలసినంత ఆనందం, శాంతి, సౌఖ్యం లభిస్తున్నాయి."

"ఇవన్నీ కృత్రిమాలు. నువ్వు భ్రమపడుతున్నావు."

"రాజా!"

"అవును, వదినా! ఇదంతా నీ భ్రమే. ఈ కృత్రిమానందాన్ని నువ్వు ఎక్కువ రోజులు అనుభవించలేవు. నువ్వనుకొనే ఆనందం వెనుక అంతులేని దుఃఖం దాగివుంది. నువ్వు కోరే శాంతికి వెనుక అగాధమైన అశాంతి ఉంది. అది తెలిసీ నువ్వు కప్పిపుచ్చుతున్నావు. ఇంతకూ ఆయన పేరేమిటి? ఎక్కడుంటున్నారు? ఏం చేస్తున్నారు?"

"వద్దు, రాజా, వద్దు. నీబోటివాళ్ళు అతనితో మాట్లాడకూడదు. ఆయన కక్కడ అది సుఖంగా ఉంది. కనీసం ఆయనైనా సుఖంగా ఉంటే చాలు."

"నువ్వు ఏమీ చెప్పనన్నమాట."

"క్షమించు. నేనేం చెప్పలేను."

"సరే" అన్నాడు రాజా. 'నువ్వు చెప్పనంత మాత్రాన తెలుసుకోలేననుకున్నావా, వదినా' అనుకొన్నాడు మనసులో.

(సశేషం)

Printed and Published by S. V. Swamy B.A., on behalf of Andhra Prabha Ltd. and Printed at Dinamani Press, Mount Road, Madras and Published at Gandlapalli, Chittoor. Editor: Neelamraju Venkataseshaiah.